ప్రజాశక్తి
శుక్రవారం 6 డిసెంబర్ 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





తడిసిన ధాన్యం కొనుగోలులో

ఆంక్షలు ఎత్తివేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

అధిక వర్షాల కారణంగా తడిసిన ధాన్యం కొనుగోలులో పారదర్శకత పాటించాలని, ఆంక్షలను ఎత్తివేయాలని, రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య అన్నారు. గురువారం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో వరికి అపార నష్టం జరిగిందన్నారు. జిల్లాలో 35 వేల ఎకరాల్లో వరి పంట నీట నానిందని చెప్పారు. ఆ పంటను ఒడ్డుకు చేర్చుకునేందుకు రైతులకు అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందన్నారు. సుమారు 13 వేల ఎకరాల్లో ధాన్యం ఇంటికి చేరిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకునేందుకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకుని బస్తాకు రూ.200 నుంచి రూ.300 నష్టపోవాల్సి వస్తోందన్నారు. తేమ శాతం 17 లోపు ఉంటేనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. కొంతమేర అదనంగా తేమ శాతం ఉంటే ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలులో కొన్ని ఆంక్షలు తొలగించి.. రైతుల వద్ద నుండి తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలన్నారు. ప్రైవేట్ వ్యాపారులకు రైతులు 75 కిలోల బస్తాను రూ.1300 నుంచి రూ.1400కు తెగనమ్ముకోవాల్సి వస్తోందన్నారు. అదే ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే రైతుకు రూ.1740 లభిస్తుందన్నారు. ఎకరాకు రైతు రూ.10 వేల నుంచి రూ.12 వేలు నష్టపోవాల్సి వస్తోందన్నారు. మంత్రులు కూడా ధాన్యాన్ని కొనుగోలు ▶ 2లో

వీడని వాన

- కొనసాగితే పంటలకు నష్టం
- ఇప్పటికే జిల్లాలో 2,198 హెక్టార్లలో మునక



సిఎస్‌పురం, పెద్ద గోగులపల్లిలో నీటమునిగిన మినుము పంట

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుపాన్ కారణంగా నాలుగు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాకు దక్షిణ ప్రాంతంతో పాటు కనిగిరి నియోజకవర్గంలో ఎక్కువగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి అడపాదడపా కురుస్తూనే ఉన్నాయి. గురువారం ఉదయం కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే 2,198 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. ఐదు మండ లాల్లోనే ఎక్కువగా పంటలు దెబ్బతిన్నాయి. పూతపిందె కంకి దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లింది. వర్షాలకు కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో శనగ, మినుము, కంది తదితర పంటలకు నష్టం జరిగింది. పొలాల్లో నీరు చేరింది. ఈదురు గాలులకు వరి కూడా నేల వాలింది. ఒంగోలు డివిజన్‌లో ఎక్కువగా వర్షం లేకపోవడంతో పంటలకు పెద్దగా నష్టం జరగలేదని జేడిఏ శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యానవన పంటలకూ నష్టం జరిగింది. కందుకూరు, కనిగిరి నియోజకవర్గా లతో పాటు కొండపి నియోజకవర్గంలోని మండలాల్లో వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం ఒంగోలులోనూ మంచి వర్షం పడింది. వర్షం కొనసాగితే పంటలకు ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం మాత్రం వీడలేదు. రోజూ కురుస్తూనే ఉంది. వాతావర ణం కూడా మారింది. చలిగాలులు పెరిగాయి. ఈ వాతావరణానికి పంటలకు పురుగు కూడా ఆశించే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం ఉదయం కూడా దర్శి ప్రాంతంలో తప్ప మిగతా మండలాల్లో వర్షపాతం నమోదైంది. కనిగిరిలో అత్యధికంగా 130.2 మి.మీ.ల వర్షం కురిసింది. వాగులు, వంకలు పారుతున్నాయి. హనుమంతునిపాడులో 93 మి.మీ., కొండపిలో 46.8 మి.మీ.లు, పీసీపల్లిలో 46.4 మి.మీ.లు, టంగుటూరులో 38.4, సీఎస్‌పురంలో 34.2, గిద్దలూరులో 31.2, వెలిగండ్లలో 27.6, పామూరులో 26.4, రాచర్లలో 25.6, కొమరోలులో 24.2, పుల్లలచెరువులో 20 మి.మీ.లు వర్షం కురిసింది. ఇంకా పలు మండలాల్లో స్వల్పంగా వర్షపాతం నమోదైంది.



మాట్లాడుతున్న మంత్రి స్వామి

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మంత్రి స్వామి 3లో




ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తాం..

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారథి 4లో

కూలి పని కోసం వచ్చి..

- విద్యుత్ షాక్‌తో ఇద్దరు వ్యవసాయ కూలీలు మృతి
- నిమ్మ తోటలో తీగలు సరిచేస్తుండగా ప్రమాదం
- మృతులు పెద్దారవీడు గ్రామస్తులు



మృతిచెందిన రంగారావు, నాగరాజు

ప్రజాశక్తి-కొనకనమిట్ల, పొదిలి

కూలి పని కోసం వచ్చిన ఇద్దరు కూలీలు కరెంటు షాక్‌కు గురై.. మృత్యువాత పడిన ఘటన కొనకనమిట్ల మండలం, చిన్నారికట్ల గ్రామంలో గురువారం జరిగింది. కొనకనమిట్ల మండలంలోని సిద్ధవరం–చినారికట్ల జాతీయ రహదారి సమీపంలో మార్కాపురం ప్రాంతానికి చెందిన మారెళ్ళ చెన్నారెడ్డి అనే రైతుకు సంబంధించిన నిమ్మ తోటలో కరెంటు పనుల నిమిత్తం పెద్దారవీడు గ్రామానికి సంబంధించిన కూలీలు వచ్చి పనిచేస్తున్నారు. వీరికి కరెంటు పనులు కూడా వచ్చని తెలియడంతో చెన్నారెడ్డి తన తోటలో ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేసుకున్న సందర్భంగా కరెంటు స్తంభాలకు విద్యుత్ తీగలను లాగేందుకు వీరిని పనిలో పెట్టుకున్నారు. దూదేకుల కాశి వలి, దూదేకుల నాగూర్ మీరా, దూదేకుల మస్తాన్, సంకుల రంగారావు(30), ఒంటరి నాగరాజు(31) గురువారం చెన్నారెడ్డి పొలంలో విద్యుత్ తీగలు లాగే పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కింద గడ్డిలో ఉన్న విద్యుత్ మోటారుకు సంబంధించిన జాయింట్ తీగ వద్ద జాయింట్ పోవడంతో అక్కడ మెయిన్‌తీగ సంకుల రంగారావు, నాగరాజుకు తగిలి ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. క్షతగాత్రులను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో ఉంచారు. రంగారావుకు భార్య రంగలక్ష్మమ్మ, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారు.

నాగరాజుకు భార్య తిరుపతమ్మ, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారు. విషయం తెలుసుకున్న మతుల బంధువులు పెద్దఎత్తున వైద్యశాల వద్దకు చేరుకున్నారు.

ఈ ప్రమాదానికి కారణమెవరు?

విచ్చలవిడిగా విద్యుత్ స్తంభాలు, తీగల ఏర్పాటు వల్లే ఇలాంటి విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామీణ స్థాయిలో వ్యవసాయ క్షేత్రాలలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఇందుకు కారణం. విద్యుత్ ఎలోసి తీసుకోకుండానే విద్యుత్ ▶ 2లో

రెట్టింపు బాదుడు

పెంచిన విద్యుత్ ఛార్జీలతో జనం విలవిల



గత నెల రూ.448, ఈ నెల రూ.896 వచ్చిన బిల్లులు

ప్రజాశక్తి-దర్శి

విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక వినియోగదారులపై అదనపు ఛార్జీలను భారీగా వడ్డిస్తోంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాలతో అల్లాడుతున్న జనం విద్యుత్ ఛార్జీలు కూడా పెరగడంతో విలవిలలాడుతున్నారు. గత నెల కంటే ఈ నెల కరెంటు బిల్లు రెట్టింపు వస్తుండటంతో బెంబేలెత్తుతున్నారు. దర్శికి చెందిన బత్తుల కొండయ్య ఇంట్లో ఒక్కరే నివాసం ఉంటున్నారు. ఈయనకు గత నెల కరెంటు బిల్లు రూ.448 వచ్చింది. ఈ సారి ట్రూఅప్ మరియు అదనపు ఛార్జీల పేరుతో రెట్టింపు బిల్లు రూ.896 రావడంతో కొండయ్య ఖంగుతిన్నారు. నాకు వచ్చే పింఛన్‌లో కరెంటు బిల్లుకే రూ.వెయ్యి వరకు పోతే ఇక ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు.

కూలి పని కోసం వచ్చి..

(మొదటిపేజీ తరువాయి)

తీగల పనులు చేయించడం ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ప్రమాదానికి కారణాల పై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు విచారణ చేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మృతుల బంధువులు కోరుతున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్

చినారికట్ల వద్ద వ్యవసాయపొలంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలి. వారి కుటుంబ సభ్యులకు విద్యుత్ శాఖలో ఉద్యోగ అవకాశం కల్పించాలి. వారి పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.



మృతదేహాలను పరిశీలిస్తున్న టిడిపి వైపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

బాధిత కుటుంబాలకు ఎరిక్షన్‌బాబు పరామర్శ

ప్రజాశక్తి-పెద్దారవీడు

కొనకనమిట్ల మండలంలో గురువారం విద్యుత్ షాక్‌తో పెద్దారవీడుకు చెందిన సంకుల రంగారావు, ఒంటేరు నాగరాజు మరణించడం పట్ల టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొదిలి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వారి భౌతికకాయాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తడిసిన ధాన్యం కొనుగోలులో ఆంక్షలు ఎత్తివేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలకు తీసుకురావాలంటున్నారని, తీరా రైతులు అక్కడికి వెళ్లాక తేమ శాతమని అధికారులు ముప్పతిప్పలు పెడుతున్నారని పేర్కొన్నారు. రైతుకు కావలసిన గోనెసంచులు, రవాణా ఖర్చులు భరించలేక ధాన్యాన్ని రైతులు బయట మార్కెట్లో అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా సిబ్బందిని నియమించి, రైతులకు కావాల్సిన గోతాలు, రవాణా సౌకర్యం వంటి ప్రోత్సాహకాలు కల్పిస్తే రైతులు నష్టపోవలసిన అవసరం ఉండదన్నారు. అందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వీడని వర్షం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న ఒక మోస్తరు వర్షానికి పలు గ్రామాల్లోని పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. గురువారం 31.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. పాములపల్లె, మేకల నరవ, కొండల ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గిద్దలూరు నక్కలవాగు పొంగి పొర్లుతోంది. వర్షం ఇలాగే కొనసాగితే శనగ పంట దెబ్బతినే పరిస్థితులు ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మరో ఐదుగురికి గాయాలు

జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మద్దిపాడు మండలం, ఏడుగుండ్లపాడులో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒరిస్సాకు చెందిన వ్యక్తి మృతి చెందగా, గుండ్లపల్లి ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



కొమరోలులో చెట్టుకు ఢీకొన్న కారు

ప్రజాశక్తి-మద్దిపాడు

రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు ఫ్లై ఓవర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం, గంజాం జిల్లా, బరంపూర్ టౌన్, కొనిచ్చి గ్రామానికి చెందిన బొడ్డు బైరి (45) గ్రామంలో గల శరవాణి కోల్డ్ స్టోరేజీలో పనిచేస్తున్నాడు. ఫ్లై ఓవర్ స్టార్టింగ్ వద్ద రోడ్డు దాటుతుండగా ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైరి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


వాహనం ఢీకొని గుర్తు తెలియని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని గుండ్లపల్లి ఫ్లైఓవర్‌పై అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సుమారు 35 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం గుర్తుపట్టలేనంత విధంగా ఉంది. మృతుడు నలుపు కలర్ ప్యాంటు, నలుపు కలర్ టీ షర్టు ధరించి ఉన్నాడని, చామన్ ఛాయ రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. సుమారు ఐదు అడుగుల పొడవు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్ హాస్పటల్‌కు తరలించినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. మృతిని వద్ద పెన్‌డ్రైవ్ ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం..

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని వెల్లంపల్లి ఫ్లైఓవర్ దాటిన తర్వాత రఘురామ పైపులు కంపెనీ ఎదురుగా చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అన్నంగి గ్రామానికి చెందిన బత్తిన రామయ్య వెల్లంపల్లి నుంచి తన స్వగ్రామం అన్నంగి గ్రామానికి బైక్‌పై వెళుతుండగా వెల్లంపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తర్వాత రఘురామ పైపులు కంపెనీ ఎదురుగా వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రామయ్యను 108లో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు.

జింకలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

కొండపి: జింకలు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు అయిన సంఘటన కొండపి-అనకర్లపూడి మధ్యలో కోల్డ్‌స్టోరేజ్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి గ్రామానికి చెందిన సుదాకర్‌రావు అనకర్లపూడి నుంచి కొండపి వస్తుండగా కోల్డ్‌స్టోరేజ్ సమీపంలో ఒక్కసారిగా జింకలు గుంపు అడ్డు వచ్చాయి. ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బైకుపై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో కొండపి వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

కొమరోలు: ప్రకాశం జిల్లా కొమరోలు మండలం రహదారి ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొమరోలు మండలం పరిధిలోని పామూరుపల్లె గ్రామం వద్ద చోటు చేసుకున్నది కడప నుంచి శ్రీశైలం వెళుతున్న కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును వేగంగా ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని 108 వాహనంలో పోరుమామిళ్ల వైద్యశాలకు తరలించారు. అనంతరం ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్ ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.



గుర్రపు డెక్కలో వ్యక్తి మృతదేహం

కాలువలో వ్యక్తి మృతదేహం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి-చీరాల

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికుల గుర్తించిన సంఘటన చీరాల మండలం ఈపురుపాలెం స్ట్రెట్ కట్ కాలువ రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం జరిగింది. అందిన వివరాల మేరకు.. ఈపురుపాలెం స్ట్రెట్ కట్ కాలువ సమీపంలోని నివాసితులు బహిర్భూమికి వెళ్లడంతో అక్కడ నీటిలోని గుర్రపుడెక్కలో చిక్కుకొని సుమారు 45 సంవత్సరాల వ్యక్తి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. సచివాలయం మహిళా పోలీస్ ద్వారా ఈపురుపాలెం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా కాలువలో మృతదేహం ఎగువ నుంచి నీటిలో కొట్టకు వచ్చేందుకు అవకాశం లేదని, కాలువ అంతటా పిచ్చి చెట్లు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. మృతి చెందిన వ్యక్తి కాలువలో కొట్టుకు వచ్చాడా..? లేక వంతెనపై ప్రయాణిస్తున్న రైలు నుంచి జారిపడ్డాడా..? ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది తేలాల్సి ఉంది.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు


ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లు మండలంతో పాటు కారంచేడు మండలం పోలీస్ స్టేషన్‌లో బైకుల దొంగతనం కేసులో వ్యక్తిని ఇంకొల్లు పోలీసులు గురువారం అరెస్టు చేసి పర్చూరు కోర్టుకు హాజరు పరిచారు. జడ్జి ముద్దాయికి 16 రోజులు రిమాండ్ విధించినట్లు ఇంకొల్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన కోడూరి శ్రీనివాస రావు బైకు దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇతనిపై పలు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిందితుడిని గురువారం పూసపాడు అడ్డరోడ్డు వద్ద ఇంకొల్లు ఎస్ఐ తన సిబ్బందితో అరెస్టు చేసి పర్చూరు కోర్టుకు హాజరు పరిచారు.

విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడి మృతికి యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి-బేస్తవారిపేట

రాయచోటి జిల్లా కొత్తపల్లి ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇజాజ్ విద్యార్థుల దాడిలో మృతి చెందడం బాధాకరమని యుటిఎఫ్ బేస్తవారిపేట మండల నాయకులు ఖండించారు. ఈ సంఘటనపై అధికారులు తగు చర్యలు తీసుకొని పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఆ పాఠశాలలో గుట్కా, గంజాయి సంస్కృతి ఉన్నట్లు తమ ఉపాధ్యాయుల విచారణలో తేలినట్లు తెలిపారు. ఉపాధ్యాయులపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గుట్కా, గంజాయి సేవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల తరపున వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఒక ప్రకటనలో వారు తెలిపారు.



పమిడి రంగయ్యకు నివాళులర్పిస్తున్న దామచర్ల సత్య

రంగయ్య మృతి తీరని లోటు: సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

టీడీపీ సీనియర్ నాయకులు పమిడి రంగయ్య మృతి పార్టీకి తీరని లోటని ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. పొందూరులోని ఆయన స్వగృహంలో పమిడి రంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పమిడి రంగయ్య కుటుంబ సభ్యులను సత్య పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ప్రముఖ పారిశ్రామిక వేత్త బెల్లం జయంత్ బాబు, సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, రంగయ్య తదితరులు ఉన్నారు.

పంటలు వర్షార్పణం

ప్రజాశక్తి-కొమరోలు



కొమరోలులో నీట మునిగిన పంట

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంట పొలాలలో నీరు చేరింది. మండలంలోని పలు గ్రామాలలో వరిపైరు కోతదశకు చేరింది. అధిక వర్షం, గాలులు వీస్తే పంట దెబ్బ తినే ప్రమాదం ఉందని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాజశ్రీ మాట్లాడుతూ కొమరోలు మండ లంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 350 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మండలం లో పప్పు శనగ 330 హెక్టార్లు, వరి 20 హెక్టార్లలో నష్టపోయినట్టుగా రాజశ్రీ వెల్లడించారు. తుపాను కారణంగా నీరు పంట పొలాల్లో నిల్వ ఉంటోందని, ఎప్పటి నీటిని అప్పుడే తీసివేయడం వలన పంట నష్టం తగ్గుతుందని ఆమె తెలిపారు. భారీ వర్షాలకు రెడ్డిచెర్ల, బొడ్డువానిపల్లె ఎస్సీ కాలనీ, కొమరోలులోని రహదారులు జలమయమయ్యాయి. ఆయా కాలనీలలో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సూరావారిపల్లె, బాదనేనిపల్లె గ్రామాలకు రాకపోకలు సాగించే పులి వాగు చప్టాల పైకి వర్షపు నీరు పారుతుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాహనాలు వెళ్లకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాంకేతిక పద్ధతులను రైతులకు చేరవేయాలి

జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఎస్ రామ్మోహన్

ప్రజాశక్తి-బేస్తవారిపేట

పెరుగుతున్న సాంకేతిక పద్ధతులను సిబ్బంది తెలుసుకుని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేయాలని జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఎస్ రామ్మోహన్ అన్నారు. గురువారం బేస్తవారిపేట మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గిద్దలూరు, మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. సిఎల్ఎస్ యాప్‌లో అన్ని పంటలకు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం అధికారి ఆర్కే బీ రాప్తార్ శిక్షణకు సంబంధించిన అంశాలను సిబ్బందికి వివరించారు. అనంతరం నీకునాం బాదులోని రైతులు సాగుచేసిన శనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రమేష్, ఎస్ఆర్ఎస్ దర్శి శాస్త్రవేత్త సంధ్యారాణి, గిద్దలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్, గిద్ద లూరు మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విజయవాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు స్టేట్ టాస్క్ ఫోర్సు ఎక్సైజ్ సూపరింటిండెంట్ సి మధుబాబు ఆధ్వర్యంలో స్టేట్ టాస్క్ ఫోర్సు సిఐ బాల నరసింహ తన సిబ్బందితో కలిసి పుల్లలచెరువు మండలంలోని పెద్ద పిఆర్‌సి తాండా అటవీ ప్రాంతంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారికి సిద్దంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను గుర్తించారు. దానిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో యయర్రగొండపాలెం ఎక్సైజ్ ఎస్సై కష్ణారావుతో పాటు స్టేట్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



అఖండ పడి భజన సందర్భంగా ఏర్పాటు చేసిన మందిరం

ఘనంగా అఖండ పడిభజన

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు గ్రామంలో అఖండ పడిభజన బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత శివయ్య, వినాయక, అయ్యప్ప, కుమార స్వామి, దుర్గమ్మ దేవతామూర్తుల విగ్రహాలకు నగరోత్సవం నిర్వహించారు. పడి భజన అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సిహెచ్.రమేష్ బాబు, మాలధారణ దారులు బత్తుల అంజిరెడ్డి,పసల ఆంజనేయులు, శింగమనేని.ఆంజనేయులు, లింగా ఆంజనేయులు, ఆవులమంద శ్రీను, ఆవులమంద వెంకట్రావు, యాదాల పవన్ కుమార్, నడిపినేని శ్రీకాంత్, యలగాల చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సాహితీ భారతి నిర్వాహకులు

ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

సినీ గాయకుడు ఘంటసాల ఓ ధవతార అని సప్తస్వర సంగీత కళాశాల ప్రిన్సిపల్ కోటి రాజ్ కొనియాడారు. బాపట్ల పట్టణంలోని జమేదారు పేటలోని సప్తస్వర సంగీత కళాశాలలో ఘంటసాల 102వ జయంతి గురువారం నిర్వహిఒంచారు. ఈ సందర్భంగా కోటిరాజ్ మాట్లాడుతూ ఘంటసాల దాదాపు 660 సినిమాలలో పదివేల పైచిలుకు పాటలు పాడి పండిత పామరులను సైతం ఉర్రూతలూగించారన్నారు. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ ఘంటసాల గానం చేసిన భగవద్గీత తరతరాలకు అజరామరంగా ఉంటుందన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షుడు మర్రి మల్యాద్రి రావు మాట్లాడుతూ ఘంటసాల లలిత శాస్త్రీయ సంగీతాలలో అద్భుతంగా గానం చేసి సంగీత సాహిత్య లోకాన్ని అలరించారన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, సంగీత కళాశాల ఉపాధ్యాయినులు అల్లూరమ్మ, నాగమణి, శోభారాణి, రమణమ్మ , సంగీత కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-కొల్లూరు

బాలల చట్టాలు, హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. బాలల హక్కులపై వంద రోజులు అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని రావికంపాడు మండల పరిషత్ పాఠశాలలో బాలలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ బాలలకు కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు సద్వినియోగం చేసు కోవాలన్నారు. బాలలు తమ హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తుంటే ఉన్నత అధికారులు తెలియజేయాలన్నారు. బాలల హక్కులకు భంగం కలిగితే 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి న్యాయం పొందాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, శ్రీలక్ష్మి, ప్రసాద్ ,ఆశ కార్యకర్తలు, కిషోర్ బాలికలు తదితరులు పాల్గొన్నారు

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తాం..

బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి-కొల్లూరు, బాపట్ల జిల్లా

జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గహ నిర్మాణశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం వేమూరు నియోజకవర్గంలోని జంపని గ్రామంలో వరి కల్లాలను రాష్ట్ర మంత్రులు పార్థసారధి, గొట్టిపాటి రవి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షలా 15 వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారని, ఇప్పటివరకు 9 వేల ఎకరాల్లో వరి కోతలు జరిగాయని చెప్పారు. 25 వేల టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో వరి పండించిన రైతులందరూ రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యాన్ని అమ్మకాలు చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్మకాలు సాగించాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతు సేవా కేంద్రాలలో అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు తేమ శాతాన్ని నిర్ధారించి కొనుగోలు చేయాలని చెప్పారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆరు గంటల సమయంలోగా రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లోగా రైతుల ఖాతాలకు నగదు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. రైతులు పండించిన వరి ధాన్యం తేమ శాతం 17 వరకు ఎలాంటి కోతలు ఉండవని, తేమ శాతం 22 శాతంపైన ఉన్నట్లయితే క్వింటాకు 5 కేజీలు మినహాయింపు ఉంటుందని తెలియజేశారు. గత ప్రభుత్వం రైతులకు ఉన్న బకాయిలను రూ.1,640 కోట్లను కూటమి ప్రభుత్వం రైతులకు జమ చేసిందన్నారు. అనంతరం మంత్రులు కొల్లూరు మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రాన్ని పరిశీలించారు. రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు ధాన్యం తేమ శాతాన్ని కొలిచి ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ధాన్యాన్ని నిర్దిష్ట సమయంలోగా లారీలను రైస్‌మిల్లులకు రవాణా చేయాలని చెప్పారు. అక్కడికి వచ్చిన రైతులతో వారు మాట్లాడి ఏమైనా సమస్యలు ఉంటే రైతుల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కొల్లూరు మండల కేంద్రంలోని రైస్‌మిల్లును మంత్రులు సందర్శించి మిల్లులో ధాన్యాన్ని పరిశీలించారు. కొల్లూరు గ్రామ శివారులోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన గృహనిర్మాణ లేఔట్‌ను మంత్రులు పరిశీలించారు. గహనిర్మాణ లేఔట్‌లో స్థానికులు ప్రజలు రోడ్డు సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి విబి విలియమ్స్, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, వేమూరు, కొల్లూరు తహశీల్దార్లు సుశీల, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మంత్రులు, ఎమ్మెల్యే

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రైలు పేటలో విఆర్ఒ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని గ్రామ సర్పంచి దారా రవి కిరణ్మయి చెన్నయ్య గురు వారం ప్రారం భించారు. ఈ సందర్భంగా విఆర్ఒ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కమలాకర్ మాట్లాడుతూ కుట్టు శిక్షణా కేంద్రంలో నాలుగు నెలలపాటు మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ సమస్థ సర్కిల్ కోఆర్డినేటర్ దేవిక, విఒఎ కక్ర స్వరాజ్యలక్ష్మి , మహిళలు తదితరులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి

తహశీల్దార్లతో ఆర్‌డిఒ సమావేశం

ప్రజాశక్తి - చీరాల

భూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి జనవరి 8 వరకూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు అధ్యక్షతన తహశీల్దార్లు, రైతు సంఘాల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణపై చర్చించారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ భూ సమస్యలకు సంతప్తికర పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు రూపకల్పన చేసినట్లు తెలిపారు.. ప్రజలు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా అధికారులే వారి వద్దకు వెళ్లి రెవెన్యూ, భూ సమస్యలను తెలుసుకొని పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యమ్రంలో తహశీల్దార్లు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు

పేదల నివాసాల సమీపంలో..

మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించొద్దు

ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

పేదల నివాసాల సమీపంలో నిర్మించ తలపెట్టిన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టిపి) నిర్మాణాన్ని నిలుపుదల చేసి ఆస్థలంలో అంబేద్కర్ పార్కును ఎర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని ప్రజా సంఘాల నాయకులు గురువారం పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తాము మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని వ్యతిరేకించడం లేదని, ప్రజల నివాసాల సమీపంలో నిర్మించడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రజల నివాసాలకు దగ్గరగా, మురుగు పారుదల అవకాశం లేని దగ్గర ప్లాంట్ నిర్మాణం చేపట్టడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ప్లాంట్ నిర్మాణం చేయాలంటే ప్రజల నివాసాలకు కిలోమీటరు నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలని పొల్యూషన్ బోర్డు నిబంధనలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ ప్రాజెక్టు నిర్మించ తలపెట్టిన 100 మీటర్ల దూరంలోనే సుమారు 5000 మంది చిన్నపిల్లలు చదువుకునే స్కూల్ ఉందన్నారు. 500 మీటర్ల పరిధిలో చుట్టూ 15000 మంది దళితులు, గిరిజనులు నివాసముంటున్నటుల తెలిపారు. 70 మీటర్లు దూరంలో 500 కుటుంబాల వారు నివాసముంటున్న రోశయ్య కాలనీ ఉందన్నారు. ఈ పాటికే డ్రైనేజీలోని నీరు పారుదల లేక మురుగు నీరు నిల్వ ఉంటున్నట్లు తెలిపారు. ఆ మురుగునీరును తాగిన పశువులు మృత్యువాత పడుతున్నట్లు వారు తెలిపారు. పంట పొలాలు కూడా ముగునీటి కారణంగా కలుషితం అవుతున్నట్లు తెలిపారు. భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇక్కడ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. పట్టణానికి దూరంగా ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, గుర్తించిన స్థలంతో పాటు అన్యాక్రాంతమైన భూమిని కూడా గుర్తించి ఆ స్తలంలో డాక్టర్ అంబేద్కర్ పార్కు ఎర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు ఎన్. బాబూరావు, బలహీన వర్గాల సమాఖ్య నాయకులు గోసాల ఆశీర్వాదం, కెవిపిఎస్ నాయకులు ఎల్. జయరాజు, పియుసిఎల్ నాయకులు దుడ్డు విజయ్ సుందర్, సవనం శామ్యూల్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బాబూరావు

ప్రజాశక్తి 5
శుక్రవారం 6 డిసెంబర్ 2024

విద్యుత్ వాతలపై జనాగ్రహం


రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం పట్ల సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. గతంలో ఎప్పుడో వాడిన కరెంటుకు ట్రూఅప్ ఛార్జీల పేరుతో ఇప్పుడు వసూళ్లకు పాల్పడడం దుర్మార్గమనే విమర్శలున్నాయి. ఈ భారాలను తక్షణమే రద్దు చేయాలనేది ప్రజా వాక్కు.

- ప్రజాశక్తి - యంత్రాంగం

పెరిగిన విద్యుత్ బిల్లులు

మాకు అక్టోబర్ నెలలో రూ.475 బిల్లు రాగా నవంబర్ నెలలో రూ.749 బిల్లు వచ్చింది. ట్రూ అప్ చార్జీలు మరింత భారంగా మారాయి. ప్రభుత్వం విద్యుత్ ట్రూ అప్ చార్జీలు పెంచితే మాలాంటి సామాన్యుల కుటుంబాలు గడవడం చాలా కష్టం. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి.

- షేక్ అబ్దుల్ వహాబ్, చికెన్ షాపు యజమాని, కంభం



అక్టోబర్‌లో రూ.475, నవంబర్‌లో రూ.749 వచ్చిన కరెంటు బిల్లులు

ప్రజలకు భారంగా ట్రూ అప్ ఛార్జీలు



ట్రూ అప్ చార్జీలు ప్రజలకు భారంగా మారాయి.. ఐదేళ్ల కిందట 300 నుంచి 500 మేరకు విద్యుత్ ఛార్జీలు వచ్చేవి గత ప్రభుత్వంలో చార్జీల పెరుగుదల వల్ల రూ.1,500 నుంచి రూ.2000 వరకు బిల్లు వచ్చేది. ప్రస్తుతం ట్రూ అప్ చార్జీల భారం కూడా మోపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి ప్రజలపై విద్యుత్ భారాలు వేయడాన్ని ప్రతి ఒక్కరూ బహిరంగంగా విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా ఎన్నికలలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై భారాన్ని వేయడం పట్ల ప్రజలు సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- గణపం రామలింగారెడ్డి, కంభం

అదనపు భారంగా విద్యుత్ ఛార్జీలు



గత నెలలో రూ.295 కరెంట్ బిల్ వచ్చింది. ఈ నెలలో వాడకం బాగా తగ్గినప్పటికీ రూ.390 వచ్చింది. ఈ నెలలో దాదాపు రూ.100 అదనంగా వచ్చింది. ట్రూ అప్ ఛార్జీల పేరుతో సామాన్యులపై అదనంగా ఛార్జీలు వసూలు చేయడం బాధాకరం. ఒక పక్క నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. కరెంట్ ఛార్జీలు పెరగడం అదనపు భారమయ్యింది.

- కోదాటి కోటేశ్వరరావు, సంతనూతలపాడు

ఫ్యాన్ కూడా వాడలేదు.. అయినా బిల్లు పెరిగింది



పోయిన నెలలో రూ.300 కరెంట్ బిల్ వచ్చింది. ఈ చలి కాలంలో ఫ్యాన్ కూడా వాడలేదు. అయినా ఈ నెలలో రూ.400 కరెంట్ బిల్లు వచ్చింది. ఒక పక్క కూరగాయలు, సరుకుల ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. మళ్లీ కరెంట్ బిల్లు పెంచడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా ఉంది.

- తన్నీరు శేషమ్మ, సంతనూతలపాడు

అదనపు భారాన్ని ప్రభుత్వమే భరాయించాలి



నాకు గత నెలలో కరెంట్ బిల్లు రూ.520 వచ్చింది. ఈ నెలలో రూ.750 వచ్చింది. ట్రూ అప్ చార్జీల పేరుతో ఇలా అదనపు భారం వేయడం సరికాదు. విద్యుత్ బిల్లులు చెల్లించడం భారంగా మారుతుంది. సామాన్య మానవులమైన మాపై అదనపు భారాలు మోపడం తగదు. విద్యుత్ అదనపు భారాన్ని ప్రభుత్వమే భరాయించాలి.

- జూపల్లి వెంకటేశ్వర్లు, యర్రగొండపాలెం

ఇష్టానుసారంగా బిల్లులు పెంచడం సరికాదు



నాకు గత నెలలో కరెంట్ బిల్లు రూ.1000 వచ్చింది. ఈ నెలలో రూ.1200 వచ్చింది. ఈ నెలలో విద్యుత్ వాడకం కూడా చాలా తక్కువ జరిగింది. అయినా బిల్లు మాత్రం అదనంగా వచ్చింది. ఇలా బిల్లులు ఇష్టానుసారంగా అదనపు చార్జీల పేరుతో పెంచడం సరికాదు. ఇది సామాన్యులకు భారంగా మారనున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే పూర్వకాలంలో పెట్టుకున్నట్లు దీపాలు పెట్టుకోక తప్పదు.

- షేక్ అల్లాబక్షు, యర్రగొండపాలెం

ఎప్పుడో వాడిన కరెంటుకు ఇప్పుడు ఛార్జీలేమిటి?



ప్రతి నెలా విద్యుత్ భారం పడుతోంది. ఎప్పుడో వాడుకున్న కరెంట్‌కు ట్రూఅప్ అని వసూలు చేయడం ఏమిటి? తాము అధికారంలోకి వస్తే ట్రూఅప్ చార్జీలు తగ్గిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు తగ్గించకపోగా మరింత భారం మోపుతూ ప్రతి నెలా బిల్లు పెంచడం అన్యాయం. అదాని, జగన్ కరెంట్ అవినీతి చేసినప్పటికీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడకపోవడం బాధాకరమైన విషయం. గత నెలలో రూ.900 వచ్చిన కరెంట్ బిల్లు ఈ నెలలో రూ.1000 వచ్చింది. పెరిగిన కరెంటు బిల్లులు భారంగా మారాయి.

- గోగినేని పున్నయ్య, ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు మండలం

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్ల పరిశీలన



కబడ్డీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నారై డాక్టర్ రాఘవేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక హైస్కూల్లో జరుగనున్న సూదనగుంట కోటయ్య చౌదరి, ఆదిలక్ష్మి మెమోరియల్ 71వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల పురుషుల కబడ్డీ పోటీల ఏర్పాట్లను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, సూదనగుంట ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎన్నారై డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, నిర్వాహకులు ఎస్ కృష్ణమూర్తి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కరరావు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సంతనూతలపాడు హైస్కూల్ గ్రౌండ్‌లో సూదనగుంట ఫౌండేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ ఎన్నారై డాక్టర్ ఎస్ రాఘవేంద్రప్రసాద్ పర్యవేక్షణలో రాష్ట్ర స్థాయిలో సీనియర్ మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు జరగనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కర్ రావు తెలిపారు. ఏడో తేదీ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఫ్లడ్ లైట్స్ వెలుతురులో మ్యాట్స్ మధ్య రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు భాస్కరరావు వెల్లడిం చారు. తాను పుట్టిన గడ్డ అయిన సంతనూతలపాడులో చదువుకున్న స్థానిక హైస్కూల్లో రాష్ట్రస్థాయిలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నందుకుగాను తనకు ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు ఎన్ఆర్ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.



అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ లక్ష్మీప్రసన్న

ఉప్పుగుండూరులో భారీగా బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు మణికంఠ రైస్ మిల్లులో రేషన్ బియ్యం దందా సాగుతోంది. ఈ సమాచారం తెలుసుకున్న ఆర్‌డిఓ లక్ష్మీ ప్రసన్న గురువారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. మిల్లులో పరిశీలించగా భారీ మొత్తంలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. తదుపరి జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టరు గోపాలకృష్ణకు సమాచారం అందించారు. వారు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. దాంతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో లెక్కించి స్వాధీనం చేసుకుంటామని ఆర్‌డిఓ తెలిపారు. ఈ దాడుల్లో తహశీల్దార్ కె ప్రవీణ్ కుమార్, ఆర్ఐ రమేష్, విఆర్ఓ ఎర్ర సుబ్బయ్య, ఆర్‌డిఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మనోహర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్డీటీ పీడీ మాంచో ఫెర్రర్‌తో భేటీ


సౌకర్యాలు కల్పించాలని వైపాలెం గిరిజన నాయకుల వినతి



ఫెర్రర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైపాలెం గిరిజన నాయకులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యాలయంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను గురువారం యర్రగొండపాలెం మండలానికి చెందిన గిరిజన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల పరిధిలో గల దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా గిరిజన గూడేల్లో పక్కా గృహాలు, పాఠశాలలు, మంచినీటి సౌకర్యం, విద్యా, వైద్యం, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మాంచో పెర్రర్ సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలలో రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ చెవుల అంజయ్య, వెంకటాద్రిపాలెం సర్పంచ్ బోడా శ్రీశైలపతి నాయుడు, విటిడిపి ప్రెసిడెంట్ నిమ్మల ఈదన్న, టీడీపీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి దేశావత్, బస్సేనాయక్, గురుకుల పాఠశాల చైర్మన్ మండ్లి బసవయ్య, పాలుట్ల టీడీపీ గ్రామ కమిటీ సభ్యులు నేనావత్, మల్లునాయక్ తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

అనుములపల్లిలో స్థల పరిశీలన

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం అనుములపల్లి గ్రామంలో సచివాలయాన్ని, విద్యుత్ సబ్ స్టేషన్‌కు సంబంధించిన స్థలాన్ని మార్కాపురం డివిజన్ సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుములపల్లి ఇలాకాలో సర్వేనెంబర్ 697లో 4 ఎకరాలు, సర్వేనెంబర్ 737లో 5.05 ఎకరాల విస్తీర్ణం గల రెవెన్యూ స్థలాన్ని సబ్ స్టేషన్ నిర్మాణం నిమిత్తం విద్యుత్ శాఖకు బదిలీ కోసం స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాషువా, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ 130 కేవీ ఎఇ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా పగిడి వాగు

ప్రజాశక్తి-రాచర్ల



పొంగి ప్రవహిస్తున్న పగిడివాగు

రాచర్ల మండలం పాలకవీడు సోమిదేవి పల్లి గ్రామాల మధ్య గల పగిడివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాచర్ల ఎస్ఐ పి కోటేశ్వరరావు ముందస్తు జాగ్రత్తలు రీత్యా సోమిదేవిపల్లి పాలకవీడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. రాత్రి సమయాల్లో రైళ్లు దిగి వచ్చేవారు, ఆయా గ్రామాల రైతులు, కొత్త వ్యక్తులు ఈ వాగు దాటాలనే ప్రయత్నం చేయవద్దని అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తోందని, ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తచర్యగా రోడ్డు మూసివేశామని, ప్రజలు సహకరించాలని ఎస్ఐ కోటేశ్వరరావు కోరారు.

వృద్ధుల ఆరోగ్యానికి భరోసా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



డాక్టర్ దేవర యదిద్యా

70 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద ఉచితంగా ఆరోగ్య బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా తెలిపారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ పథకం కింద పేద, తక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతుందని తెలిపారు. ఇకపై ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులు పీఎంజేఏవై కింద రూ.5 లక్షల నగదు రహిత హెల్త్ కవరేజీ పొందవచ్చునని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడానికి మూడు రోజుల ముందువరకు అయ్యే వైద్యపరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుందని తెలిపారు. చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారన్నారు. గుండె సంబంధిత వ్యాధులకు అమర్చే స్టెంటులు, ఐసీయూ, జనరల్ వార్డులో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. రోగికి చికిత్స సమయంలో ఉచితంగా భోజనం అందిస్తామని అన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 15 రోజుల పాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయన్నారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటిం టికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారని తెలిపారు. కార్డులు మంజూరు కాని 70 ఏళ్లు నిండిన వృద్ధులు ఉంటే సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆయుష్మాన్ కార్డు పొందవచ్చని చెప్పారు.

ఉపాధ్యాయులకు రక్షణ చట్టం తేవాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఉపాధ్యాయులకు రక్షణ చట్టం తేవాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఇఒ బరిగే నర్సింహారావుకు మెమోరాండం గురువారం అందజేశారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయులు మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 10శాతం కంటే మించి సెలవులు మంజూరు చేయకూడదని, అపార్ ఐడి త్వరగా పూర్తి చేయాలని, 10వ తరగతి విద్యార్థులకు సంసిద్ధత కార్యక్రమం పేరిట 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో సంక్రాంతి సెలవుల్లో కేవలం మూడు రోజులు మాత్రమే సెలవులు ఇవ్వడం, మెగా పేరెంట్ మీటింగ్ పేరిట రకరకాల యాప్స్‌ల ద్వారా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ మీద తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్‌హై అన్నారు. ఈ విధానాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వర్క్ అడ్జస్ట్మెంట్ కేవలం రిటైర్మెంట్ అయినా స్కూల్‌కు, అవసరం ఉన్న హైస్కూల్‌లకు మాత్రమే పని సర్దుబాటు చేయాలని అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఎస్ అజాజ్ అహ్మద్ విద్యార్థుల దాడిలో మరణించడం చాలా అమానుషం అన్నారు. దీన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) తీవ్రంగా ఖండిస్తోందన్నారు. విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించాలని, పాఠశాల ఆవరణలో గాని, చుట్టుప్రక్కల డ్రగ్స్, గంజాయి, ఆల్కహాల్ పూర్తిగా నిషేధం విధించాలని కోరారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల నడవడిక మీద శ్రద్ధ చూపించాలని కోరారు. విద్యార్థులకు పెద్దల పట్ల గౌరవభావం పెంచాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల రక్షణ కోసం చట్టం తేవాలని కోరారు. అజాజ్ అహ్మద్ కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేకూర్చాలని డిమాండ్ చేశారు. భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ చూపించి చట్టం తేవాలని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాసర్ మహమ్మద్, ఎస్ కామేశ్వరరావు, కపారావు, వైఎస్సార్ జ్యోతి, తాళ్లూరి నరసింహారావు, ఎస్ రామాంజనేయులు, యజ్ఞేశ్వరి, ఎం జ్యోతి, చంద్రశేఖర్ శర్మ, యోగి రాములు, బ్రహ్మారెడ్డి, కె మాల్యాద్రి, వెంకటేష్, రఘు, షేక్ ఖాసింసా, శ్రీనివాసరెడ్డి, బి శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.



ఎంఇఒకు మెమోరాండం ఇస్తున్న యుటిఎఫ్ ఉపాధ్యాయులు

చర్చలతో సర్దుకున్న వివాదం

ప్రజాశక్తి - కురిచేడు

తెలుగుదేశం నాయకుడు షేక్ హసేన్‌మియా తనకు సంబంధించిన వారి పని చేయించుకోక పోవడానికి బుధవారం తహశీల్దారు కార్యాలయానికి వెల్లారు. తమ పని చేయడానికి తహశీల్దారు కార్యాలయం సిబ్బంది రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకోటవం ఏమిటంటూ రెవిన్యూ సిబ్బందిపై, తహశీల్దారును దుర్భాషలాడారు. కార్యాలయ సిబ్బంది అందరిని దూషించాడు. అదే క్రమంలో తహశీల్దారు రూమ్‌లోకి వెళ్లి తహశీల్దారు జి రజినితో దురుసుగా మాట్లాడుతూ పని చేయలేనప్పుడు మీకు ఇక్కడేంపని అని ఆవేశపూరితంగా తహశీల్దారుతో వాగ్వాదానికి దిగారు. దీనితో మనస్థాపం చెందిన కార్యాలయం సిబ్బంది ఉన్నతాధికారైన తహశీల్దారుకు జరిగిన సంఘటన వివరించి చెప్పారు. దీనితో తహశీల్దారు రజిని జరిగిన వివరాలను తమ సిబ్బంది ద్వారా తెలుసుకొని ఈ దుశ్చర్యకు పాల్పడ్డ హసేన్‌మియాపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ తహశీల్దారు ఇచ్చిన ఫిర్యాదు కాపీని సవరణ చేసుకొని ఇవ్వవలసిందిగా కోరుతూ వచ్చిన రెవిన్యూ అధికారులను వెనక్కు పంపారు. దీనిపై స్పందించిన తహశీల్దారు జరిగిన సంఘటన మొత్తాన్ని త్రిపురాంతకం సిఐ దృష్టికి తీసుకొని వెళ్లగా గురువారం త్రిపురాంతకం సిఐ షేక్ హసేన్, కురిచేడు ఎస్ఐ బి శివ, దొనకొండ ఎస్ఐ విజయ్‌కుమార్ తహశీల్దారు కార్యాలయానికి వచ్చి జరిగిన సంఘటన పూర్వ పరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ చర్యకు పాల్పడ్డ తెలుగుదేశం నాయకులు షేక్ హసేన్‌మియాను స్థానిక తహశీల్దారు కార్యాలయానికి పిలిపించారు. ఆయనతో పాటు కురిచేడు తెలుగుదేశం నాయకులు అందరు కలిసి తహశీల్దారు కార్యాలయానికి వచ్చి జరిగిన సంఘటనపై చర్చించిన అనంతరం హసేన్ మియా చేసిన పొరపాటుకు తహశీల్దారుకు, రెవిన్యూ సిబ్బందికి క్షమాపణలు చెప్పించారు. దీంతో ఈ సమస్య సద్దుమణిగింది.



తహశీల్దారుతో చర్చిస్తున్న పోలీసు అధికారులు, టిడిపి నాయకులు

వాన నీటితో తడిసిపోతున్న తహశీల్దారు గది



వీడియో కాన్ఫరెన్స్ గదిలో తహశీల్దారు మంజునాథరెడ్డి

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

సిఎస్‌పురం తహశీల్దారు గది వాన నీటితో తడిసిపోతోంది. తహశీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని భవనం స్లాబ్ పెచ్చులూడి పడుతున్నది. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజులుగా వర్షం పడుతుండడంతో వాన నీటితో తడిసి పోతున్నది. తహశీల్దారు గదిలో స్లాబ్ నుంచి నీరు కారుతుంది. గదిలో ఒక వైపు గోడ మొత్తం నీటితో తడిసి నానిపోయిది. ఏ క్షణమైనా కూలిపోయేందుకు సిద్ధంగా మారింది. దీంతో తహశీల్దారు తన గదిలో కాకుండా వీడియో కాన్ఫరెన్స్ జరిగే గదిలో కూర్చుని తన విధులు నిర్వర్తిస్తున్నారు.



కూలెందుకు సిద్ధంగా ఉన్న గోడ

ప్రధాన రోడ్డుపై నీళ్లు పోయే దారేదీ.?

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

ప్రధాన రోడ్డుపై వర్షానికి వచ్చిన నీళ్లు పోయేందుకు దారి చూపరూ అంటూ మండలంలోని డిజి పేట గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని ప్రధాన ఆర్అండ్‌బి రోడ్డుపై రామాలయం సమీపంలో నన్నసాని మహాలక్ష్మయ్య ఇంటి ముందు వర్షం నీరు నిల్వ ఉండి చెరువులా మారింది. ఆ ప్రాంతంలో రోడ్డు గుంతగా ఉండడంతో కొద్దిపాటి వర్షం కురిసిన నీరు నిల్వ ఉంటున్నాయి. ఈ వర్షం నీటి కారణంగా ప్రజలు ఆ దారిన వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన నీళ్లు పోయేందుకు కాల్వ నిర్మించి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



డిజి పేటలో ప్రధాన ఆర్అండ్‌బి రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు



వధూవరులను అభినందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

వివాహానికి హాజరైన బూచేపల్లి

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని రెడ్డినగర్ గ్రామంలో రమణారెడ్డి కుమార్తె వివాహానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం హాజరయ్యారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సోము దుర్గారెడ్డి, ఉడుముల వెంకటరెడ్డి, కర్ణ శ్రీనివాస్‌రెడ్డి, చింతలపూడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవనాలు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడి భవనాలను పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు పంచాయతీ రాజ్ శాఖ ఈఈ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు పంచాయతీలోని ఉప్పలపాడు ఎస్టి కాలనీ, రంగనాయుడుపల్లి గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడి భవనాలు పూర్తిచేసి ఇబ్బందులు తీర్చాలంటూ ప్రజాశక్తిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించారు. ప్రతిపాదనలు పంపించినట్లు డిఈ శ్రీధర్‌రెడ్డి, ఈఈ కోటేశ్వరరావు ప్రజాశక్తికి తెలిపారు.



మాట్లాడుతున్న సిఐ వై రామారావు

అనాథలకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-దర్శి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటాచల క్షేత్రంలో గురువారం అనాథ వృద్ధుల కోసం గురువారం వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. పలువురు వైద్యుల సహకారంతో వైద్య పరీక్షలు చేయించారు. ఉచితంగా మందులు, పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా దర్శి సిఐ వై రామారావు మాట్లాడుతూ అనాథలకు అండగా నిలిచిన మానవత సేవా సంస్థను అభినందించారు. డాక్టర్ సుమంత్ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. దర్శి ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమంత్, మీనాక్షి హాస్పిటల్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ మల్లారెడ్డి, డిపిఎంఒ డాక్టర్ సుబ్బారెడ్డి, మానవత ఛైర్మన్ దేవతి వరప్రసాద్, అధ్యక్షులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, కన్వీనర్ కె శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ జి వేణు, విశ్రాంత తహశీల్దార్ వెంకటేశ్వర్లు, వాసుదేవరెడ్డి, జె సుశీలమ్మ, హెల్త్ ఎఎన్ఎంలు, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.



భూసార పరీక్ష పత్రాలను అందజేస్తున్న శ్రీనివాసరావు

భూసార పరీక్ష పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కొనకనమిట్ల

మండల కేంద్రమైన కొనకనమిట్లలో ప్రపంచ నేల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కె రమేష్ మాట్లాడుతూ రైతులు తప్పకుండా పచ్చిరొట్ట పైరులు సాగు చయాలని, జింక్ సూక్ష్మదాతువులు వాడుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ శ్రీనివాసరావు, భూసార పరీక్షా కేంద్రం సహాయ సంచాలకులు వి సుచరిత, వ్యవసాయశాఖ సంచాలకులు కె బాలాజినాయక్, ఎఇఓ బి విక్రమ్, విఎఎ రవితేజ, జి తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

6 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల



ఆవుల సురేష్

ఈ నెల 6నుండి రెవిన్యూ సదస్సులు ప్రారంభమవుతు న్నట్లు ఆవుల సురేష్ తెలిపారు. గ్రామ సభల్లో విఆర్ఒ నుండి సర్వేయర్, ఆర్ఐ, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. గ్రామానికి సంబంధించి అటవి, దేవాదాయ శాఖల అధికారులు గ్రామ సభల్లో పాల్గొంటారని అన్నారు. గ్రామ సభల ఉద్దేశ్యము రెవిన్యూ డిపార్ట్మెంట్‌కు సంబంధించి దారి సమస్యలు గానీ కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు అప్లికేషన్స్ పెట్టుకోవడం కానీ, 1బిలో పేరు తప్పులున్న సవరించుకోవడానికి, దీర్ఘకాలిక రెవిన్యూ సమస్యలు ఉన్న వాటిని స్వయంగా తహశీల్దార్ బృంధం పరిష్కరించుటకు తోడ్పడుతుందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో పేపర్ ప్రకటన ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

దర్శి : నేటి నుండి జనవరి 8వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ గురువారం తెలిపారు. నేడు బండివెలిగండ్ల గ్రామ సచివాలయం వద్ద, కట్టసింగన్నపాలెం పాఠశాల వద్ద రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలన్నీ పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

భూసారాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-బాపట్ల

మారుతున్న వాతావరణ పరిస్థితుల దష్ట్యా భూసారాన్ని పరిరక్షించుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి. ప్రసూన రాణి తెలిపారు. ఆరోగ్యవంతమైన నేలల ద్వారానే రసాయన రహిత ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చునని తెలిపారు. వ్యవసాయ కళాశాలలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూనరాణి మాట్లాడుతూ నేల నుంచి అన్నీ పొందే ప్రజలు నేలకు ప్రాధాన్య మివ్వాలన్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను పూర్తిస్థాయిలో నిరోధించి పర్యావరణ పరిరక్షించి నేల తల్లిని కాపాడుకోవాల అన్నారు. అన్నదాతలు మట్టి నమూనాల సేకరణ, పర్యవేక్షణ, నిర్వహణపై దష్టి పెట్టాలన్నారు. నేలల స్వభావానికి తగిన పంటలను వేసుకోని నేలతీరును అంచనా వేసి పైరుకు రసాయనాలను వినియోగిం చాలన్నారు. భూమికి హానికరంగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. నేలల పరిరక్షణపై వ్యవసాయ విద్యార్థులకు వ్యాస రచన, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రాచార్యులు పి.ఆర్.కె .ప్రసాద్,వి .శంకరరావు, సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చర్ కెమిస్ట్రీ విభాగం అధిపతి ఎం.లత ,బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో భూసార పరీక్ష పత్రాలు అందజేస్తున్న ప్రసూన



చెరుకుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు,అధికారులు

చెరుకుపల్లి : నేల ఆరోగ్యం బాగుంటేనే మనిషి ఆరోగ్యం బాగుంటుందని, నేల ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ సంరక్షించాలని ఎఒ బాలాజీ గంగాధర్ తెలిపారు. మండల పరిధిలోని ఆరుంభాక గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ అవసరమైన మేరకే రైతులు ఎరువులను వినియోగించాలన్నారు. తద్వారా నేల ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చునని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా నేల స్వభావాన్ని తెలుసుకొని అవసరమైన మేరకు ఎరువులు వినియోగించాలన్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల చేత నేల ఆరోగ్యాన్ని కాపాడుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం

ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ హేమప్రియ తెలిపారు. రేపల్లె శ్రీ సత్య సాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో విశ్రాంత ఏడీ డాక్టర్ పున్నయ్య శాస్త్రి సహకారంతో మండలంలోని కళ్లిఫలం గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ హేమ ప్రియ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాక్సినేషన్, పశువైద్య సేవలు అందించారు. అనంతరం పశుపోషకులకు మినరల్ మిక్చర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, కామేశ్వరరావు, కె. సుధారాణి, లక్ష్మణ్, ఆంజనేయులు,పశుపోషకులు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండల పరిధిలోని నిజాంపట్నం, ఆముదాలపల్లి పంచాయతీల్లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆముదాలపల్లిలో టిడిపి నాయకులు పందరబోయిన శ్రీనివాసరావు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు, అభిమానులు సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - చీరాల



షెడ్యూల్ విడుదల చేస్తున్న తహాశీల్దారు

రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి జనవరి 8 వరకూ మండల పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహాశీల్దారు గోపికృష్ణ తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తహాశీల్దారు మాట్లాడారు. గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఎదుర్కొంటున్న పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ సమస్యలు, భూ సర్వేలు, ఇతర భూ సమస్యలపై అర్జీలు అందజేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. రెవెన్యూ సదస్సులకు తహాశీల్దారు, డిప్యూటీ తహాశీల్దారు, ఆర్ఐ, రెవెన్యూ అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతరం గ్రామ రెవెన్యూ సదస్సులకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దారు అర్జున్, ఆర్ఐ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరం : భూసమస్యల పరిష్కారం కోసం నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహాశీల్దారు నాంచారయ్య తెలిపారు. ఈ సదస్సులు శుక్రవారం నుంచి జనవరి 8 వరకూ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో తహాశీల్దారు, సర్వేయర్, విఆర్ఒలు పాల్గొనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి, విశ్రాంత ఉపాధ్యాయుడు దొడ్డా బ్రహ్మానందం అనారోగ్య కారణాలతో గురువారం మతి చెందారు. యద్దనపూడి మండలం పూనూరు జడ్‌పి హైస్కూల్ లో తెలుగు పండిట్‌గా ఉద్యోగ విరమణ చేసిన బ్రహ్మానందం మార్టూరు విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. 2008 నుంచి ఇప్పటి వరకూ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శిగా సుదీర్ఘకాలం విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగించారు. బ్రహ్మానందం మృతదేహాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా-2 అధ్యక్షుడు రావుల బాపయ్య, మార్టూరు యూనిట్ అధ్యక్ష, కార్యదర్సులు షేక్ కమాలుద్దీన్, మద్దుమాల శ్రీనివాస చిట్టిబాబు, కరణం లక్ష్మయ్య, పోపూరి శివ రామ కోటేశ్వరరావు, పి.రామాంజనేయులు, శంకరరాజు, ఎ.హరిప్రసాద్, వూర మస్తానయ్య తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు



విద్యార్థులకు స్కాలర్ షిప్ అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

విద్యార్థులకు చేయూత

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్టూరు శాఖ బ్రాంచి మేనేజర్ చావలి పద్మీ తెలిపారు. చదువులో ప్రతిభ చూపిన మద్దిసత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు ఎస్‌సి,ఎస్‌టి విద్యార్థులకు ప్రగతి విద్యా స్కాలర్ షిప్ నగదు చెక్కులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజరు మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది 8,9,10 తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బ్యాంకు ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం ద్వారా ప్రగతి విద్యా స్కాలర్ షిప్‌లు అందజేస్తునట్లు తెలిపారు. తమ బ్యాంకులో ప్రగతి కుబేర - 444,త్రివేణి - 333 ఫిక్సడ్ డిపాజిట్లపై అధిక వడ్డీ అందజేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు,బ్యాంకు క్యాషియర్ రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

రైతులు పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చునని జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఎడిఎ సయ్యద్ అక్తర్ హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలోని కూచినపూడి, బొర్రావారిపాలెం గ్రామాలలో ఎఒ కె.శారద అధ్యక్షతన ఆర్కేవివై పథకం ద్వారా రైతులకు వివిధ పంటల సాగుపై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన వరి, మినుము పెసర, వేరుశనగ పంటల సాగులో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. పంటల్లో చీడ పీడల నివారణకు తీసు కోవాల్సిన చర్యలు గురించి ఎఒ కె.శారద వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు పవన్, శివకృష్ణ,పాల్గొన్నారు.



భూసార పరీక్షా పత్రాలు అందజేస్తున్న అధికారులు

అనారోగ్యంతో విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు విఆర్ఎ మస్తాన్ (67) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మస్తాన్ మృతి గురించి తెలుసుకున్న తహాశీల్దారు మేక శ్రీనివాసరావు, విఆర్ఒలు ఖాళీ కష్ణ, శివరామకష్ణ, అంబటి ప్రసాద్ తదితరులు మస్తాన్ మతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మస్తాన్ మతి పట్ల మండల గ్రామ రెవెన్యూ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.



మస్తాన్(ఫైల్)

ఉపాధ్యాయుడి హత్యకు ఖండన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఎస్‌కె.ఎజాజ్ అహ్మద్‌ను 9వ తరగతి విద్యార్థులు హత్యచేయడాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఎజాజ్ మతికి ఉపాధ్యాయ సంఘాలు సంతాప వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఒకప్పుడు ఎంతో గౌరవప్రదమైనదని తెలిపారు. నేడు చులకన భావనతో కొనసాగటం బాధాకరమన్నారు. ప్రస్తుత సమాజంలో హింస ప్రవత్తిని తెలియజేసే వీడియో గేమ్స్ మరియు సోషల్ మీడియా వల్ల విద్యార్థుల్లో ఇలాంటి ప్రవత్తి నెలకుంటుందన్నారు. దీనిపై ప్రభుత్వాలు, తల్లిదండ్రులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎజాజ్ కుటుంబానికి సంతాపం, సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కర్ర అరుణ్ కుమారి, శ్రీనివాసశర్మ, రామ కోటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

రీజనల్ పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభించిన మంత్రి స్వామి, దామచర్ల సత్య



మాట్లాడుతున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రపంచవ్యాప్తంగా నేడు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నేటియువత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించు కోవలసిన అవసరం ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్‌డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రీజనల్ పాలీ టెక్ ఫెస్ట్ -2024 కార్యక్రమాన్ని రాష్ట్రా సాంఘిక సంక్షేమ శాఖ, మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, నగర మేయర్ గంగాడ సుజాతలతో కలసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్ట్స్ ను తిలకించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య శాఖ జెడి పద్మా రావు, ప్రిన్సిపాల్ పివిఎల్ఎన్ శివ ప్రసాద్, కార్పొరేటర్ సురేష్‌బాబు, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల పరిరక్షణకు చర్యలేవీ.?

పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో అంతరించిపోతున్న వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేవని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నించారు. దేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో అంతరించి పోతున్న వన్యప్రాణుల, అరణ్యాల రక్షణ, వాటి నివాసాల పునరుద్ధరణ, ప్రజల పోకడలు, వేట వ్యతిరేక ప్రయత్నాలు, పరిరక్షణపై ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు, నిధులు, అక్రమ వ్యాపారంపై చర్యల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో మాగుంట అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల శాఖ సహాయక మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వివరణ ఇచ్చారు. పర్యావరణ చట్టం 1986 క్రింద రక్షిత ప్రాంతాల చుట్టూ సున్నిత ప్రాంతాల ఏర్పాటు చేయడం, అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణులకు అత్యధిక రక్షణ కల్పించుటకు పలు కార్యక్రమాలు నిర్వహణకు రాష్ట్రాలకు ఆర్థికసహాయాన్ని కేంద్రం అందిస్తుందని తెలిపారు.

పైపులైన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని హౌసింగ్ బోర్డ్‌లో పాత తాగునీటి పైప్‌లైన్ స్థానంలో కొత్తగా ఏర్పాటుచేసిన భారీ పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులు పూర్తి కావడంతో అక్కడ గురువారం నగరపాలక సంస్థ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. మేయర్ గంగాడ సుజాత అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మేయర్ సుజాత మాట్లాడుతూ గతంలో ఉన్న పాత పైప్ లైన్ స్థానంలో పెద్ద కొత్త పైప్ లైన్ ఏర్పాటు చేయడంతో నగరంలో చాలావరకు నీటి సరఫరాకు సౌలభ్యంగా ఉంటుందని తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకులు త్వరగా నిండుతాయని, ప్రజలకు సరిపడా నీరు షెడ్యూల్ ప్రకారం ఇవ్వవచ్చని వివరించారు. పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ కారణంగా ఇటీవల నగరంలో తాగునీటి సరఫరా లో కొన్ని అవాంతరాలు ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడ్డారని, ఇకమీదట పాత పద్ధతిలోనే షెడ్యూల్ ప్రకారం తాగునీటి సరఫరా ఉంటుందని చెప్పారు.


పరిశీలిస్తున్న మేయర్ సుజాత

మేయర్ వెంట కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, అసిస్టెంట్ ఇంజనీర్ రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, మారుతీరావు, టాప్ ఇన్స్పెక్టర్ నరసింహారావు తదితరులు ఉన్నారు.

విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్‌కి అసోసియేషన్ నేతల వినతి


కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో గ్రామ రెవిన్యూ అధికారుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను అసోసియేషన్ నాయకులు కోరారు. కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం జిల్లా విలేజ్ రెవెన్యూ అఫీసర్స్ అసోసియేషన్ నేతలు కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒ జిల్లా అధ్యక్షులు వైపి.రంగయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్.భాస్కర్ రెడ్డి, కార్యదర్శి ఏసి ఆదిరెడ్డి, కోశాధికారి కె.జానయ్య, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- 7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరుకానున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర గహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గురువారం బాపట్లకు చేరుకున్నారు. కలెక్టర్ జె వెంకట మురళితో కలిసి బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, సభా వేదిక ఏర్పాట్లను మంత్రులు పరిశీలించారు.

రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభమవుతాయని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ, హెచ్ ఆర్‌డి మంత్రి నారా లోకేష్ హాజరవుతున్నారని చెప్పారు. ఎక్కడా రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా సాదాసీదాగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాజకీయ పార్టీ నాయకులు పాల్గొనడం, పార్టీ జెండాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వంటివి లేకుండా పూర్తిగా తల్లిదండ్రులతోనే ఈ సమావేశం జరిగేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. కేవలం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులను దష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా సర్వసాధారణంగానే సమావేశాలు నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల, పర్చూరు శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య, ఏలూరి సాంబశివరావు, ఎస్పీ తుషార్ డూడి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బుడా చైర్మన్ రాజశేఖరబాబు, మాజీ శాసనసభ్యులు చీరాల గోవర్ధన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- భూ బాధితులకు న్యాయం జరగాలి
- అవినీతి, అక్రమాల అధికారులపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర మంత్రి స్వామి వెల్లడి


సమావేశంలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాధితులకు న్యాయం, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుని భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించమన్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి చెప్పారు. ఈ నెల 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు ఉండటంతో గురువారం కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు మేయర్ గంగా సుజాత, కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలతో కలిసి జిల్లాలోని పరిస్థితిపై ఆయన ప్రకాశం భవనంలో సమీక్షించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ చుక్కల భూములు, 22(ఏ) జాబితాలోని భూములపైనా అధికారులు ఈ సందర్భంగా ప్రత్యేకదష్టి సారిస్తారని ఆయన చెప్పారు. అక్రమ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను ఈ సదస్సుల ద్వారా గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు

జిల్లాలో 826 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, వీటిల్లో రెవెన్యూ సదస్సుల కోసం తహశీల్దార్ ఆధ్వర్యంలో ఒక బందాన్ని, డిప్యూటి తహశీల్దార్ ఆధ్వర్యంలో మరో బందాన్ని ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. జిల్లాస్థాయి అధికారులను మండలాలకు ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించామన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వాస్తవ అసైన్డ్ దారులకు న్యాయం చేయడానికి ఇది చక్కని అవకాశమన్నారు. సత్వర నిర్ణయం తీసుకుని బాధితులకు న్యాయం చేయాల్సి ఉంటుందన్నారు. మార్కాపురంలోని చెన్నకేశవ స్వామి ఆలయ భూములు దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయ్యాయన్నారు. వీటిపై దష్టి సారించడంతో పాటు దొంగ పాసు పుస్తకాలు ఇచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అవినీతి అధికారులను దూరంగా ఉంచాలి

- ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గతంలో అవకతవకలకు పాల్పడిన అధికారులను ఈ రెవెన్యూ సదస్సులకు దూరంగా ఉంచాలని సూచించారు. రెవెన్యూ సదస్సులపై ప్రజలకు విస్తత అవగాహన కల్పించాలని, స్థానికంగా ఈ సదస్సులు జరిగే రోజున ఉపాధిహామీ పనులు నిర్వహించకుండా ప్రజలందరూ వీటిల్లో పాల్గొనేలా చూడాలని అన్నారు.

భూహక్కుదారులకు న్యాయం చేయాలి

యర్రగొండపాలెం శాసన సభ్యులు తాడిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వాస్తవ భూయజమానులకు, వాస్తవ అసైన్డ్ దారులకు న్యాయం చేసేలా చిత్తశుద్ధితో అధికారులు పనిచేయాలన్నారు.

– ఎర్రగొండపాలెం నియోజకవర్గ టి.డి.పి ఇన్చార్జి జి.ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ పుల్లలచెరువు మండలం మానేపల్లిలో కొండపోరంబోకు భూముల ఆక్రమణపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులైన వైసిపి ప్రతినిధి డి.క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి ఆర్.స్వరూప్, బిజెపి ప్రతినిధి బి.రాజశేఖర్, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్‌కె రసూల్ ఆప్ సుదర్శనరావు, బిఎస్‌పి ప్రతినిధి టి.వెంకటస్వామి, పలు రైతు సంఘాల నాయకులు, ఎన్.జి.వోల ప్రతినిధులు మాట్లాడుతూ బలహీన వర్గాలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూముల ఆక్రమణలపైనా, శ్మశాన స్థలాల ఆక్రమణలపైనా దష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ బి. చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో కె. లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.